క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



మియాపూర్: మియాపూర్ అండ్ మదీనాగూడ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ మరమ్మతు పనుల కారణంగా పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు న్యూ కాలనీ, లక్ష్మీనగర్, దత్తసాయి కాలనీ, బాలాజీనగర్, లక్కీ రెస్టారెంట్ అండ్ బ్యాక్ సైడ్, శ్రీలా గార్డెన్, నడిగడ్డతండా, సత్యనారాయణ ఎన్‌క్లేవ్, లోటస్ కాలనీ, అంగర రెస్టారెంట్, సత్య కళ్యాణ్ అపార్ట్‌మెంట్, ఆర్‌టీఐ డెవలపర్స్, లేక్ వ్యూ, శారద స్కూల్,మియాపూర్ ఎక్స్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎలక్ట్రిక్ వాహన వినియోగంలో వృద్ధి

సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ ద్విచక్రవాహన వినియోగం మరింతగా వృద్ధి చెందనుందని ఈవీ రంగ నిపుణులు అభిప్రాయపడ్డారు. మదీనాగూడాలోని యూనివర్సల్ ఆటోమోటివ్ షోరూమ్‌లో ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన సంస్థ ప్యూర్ ఈవీ వాహనాల అనుభవ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దీనిని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విస్తృత శ్రేణి ఎలక్ట్రానిక్ మోటార్ సైకిల్స్ స్కూటర్లను వినియోగదారులు అనుభూతించారు. ఈ సందర్భంగా ప్యూర్ ఈవీ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ... ఇప్పటి దాకా 60 వేలకు పైగా విద్యుత్ ద్విచక్ర వాహనాలను డెలివరీ చేశామని, తెలంగాణలో ఏర్పాటు చేసిన లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫ్యాక్టరీని 2 లక్షల అడుగులకు విస్తరించనున్నామన్నారు.

విద్యుదాఘాతంతో ట్యాంకర్ డ్రైవర్ మృతి

పటాన్‌చెరు టౌన్: విద్యుదాఘాతానికి గురై ట్యాంకర్ డ్రైవర్ మృతిచెందిన సంఘటన పటాన్చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రసాద్ రావు వివరాల ప్రకారం... మహారాష్ట్ర, నాందేడ్ జిల్లాలోని చైనాపూర్ గ్రామానికి చెందిన ఎల్లప్ప(30) భార్య విజయమాలతో బతుకుదెరువు కోసం వచ్చి బండ్లగూడలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో బండ్లగూడకు చెందిన నందకిషోర్ వద్ద నీటిట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం వెంచర్ వద్ద నీటిని ట్యాంకర్‌లో నింపే క్రమంలో విద్యుత్ వైర్ తగిలి కిందపడ్డాడు. దీంతో చికిత్స నిమిత్తం బీరంగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు వెల్లడించారు.

సర్కారు బడులను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- గచ్చిబౌలి జెడ్పీహెచ్ఎస్‌లో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన



తరగతి గదులు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ హమీద్‌పటేల్ తదితరులు

గచ్చిబౌలి: ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. కొండాపూర్ డివిజన్‌లోని గచ్చిబౌలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ. 75 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు, జెడ్పీహెచ్ఎస్‌లో రూ. 52 లక్షలతో, ఎంపీపీ పాఠశాలలో రూ. 23 లక్షలతో చేపట్టే నిర్మాణ పనులకు ఆయన బుధవారం కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్, మండల విద్యాధికారి వెంకటయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పించి వాటి రూపురేఖలే మార్చివేస్తూ ప్రైవేటుకు దీటుగా తయారు చేయడం కోసమే మన బడీ–మన బస్తీ కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. తరగతి గదుల నిర్మాణ పనులను నాణ్యతతో కూడినవిగా చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు ఆయన సూచించారు. మన బడి–మన బస్తీ కార్యక్రమాన్ని ఫిబ్రవరిలో మొదటి విడత కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదపూరిత వాతావరణం ఉండాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. శేరిలింగంపల్లి మండలంలో 24, కూకట్‌పల్లి మండలంలో ఏడు మొత్తం 31 ప్రభుత్వ పాఠశాలలో కార్యక్రమాన్ని అమలు చేయడం ద్వారా మౌలిక వసతులు కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. టీఎస్ఈడబ్ల్యూడీసీ ఏఈ శ్యామ్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ఊట్ల కృష్ణ, రమేష్, తిరుపతిరెడ్డి, శశిధర్, తిరుపతియాదవ్, గణపతి, రవిశంకర్ నాయక్, శ్రావణ్‌యాదవ్, రాజుయాదవ్, సమీద్ రవీందర్‌రెడ్డి, అబ్దుల్‌కరీమ్, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్యకు త్వరలో పరిష్కారం



ఆదిత్యానగర్ రైల్వే ట్రాక్ వద్ద డ్రైనేజీ సమస్యను రైల్వే అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ ఆదిత్యానగర్ వద్ద నెలకొన్న డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్య త్వరలో పరిష్కారం అవుతుందని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం ఆదిత్యానగర్‌లో నాలా విస్తరణ, రైల్వే ట్రాక్‌కు సమాంతరంగా బాక్స్‌డ్రైన్ నిర్మాణం కోసం దక్షిణ మధ్య రైల్వే అధికారులు డీఈ శ్రీనివాస్, చందానగర్ డీసీ సుధాంషులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... న్యూహఫీజ్‌పేట్ ఆదిత్యానగర్, ప్రేమ్‌నగర్ కాలనీలలో రైల్వే ట్రాక్ సమాంతరంగా ఎన్నో సంవత్సరాలుగా నెలకొన్న డ్రైనేజీ ఔట్ లెట్ సమస్యను పరిష్కరించాలని ఇటీవల చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డితో కలిసి జీఎంకు విన్నవించామన్నారు. దీంతో రైల్వే అధికారులు డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్యను పరిశీలించారన్నారు. రైల్వే ట్రాక్‌కు సమాంతరంగా బాక్స్‌డ్రైన్ నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రైల్వే ఏఈ రామాంజనేయులు, జీహెచ్ఎంసీ అధికారులు ఈఈ శ్రీకాంతిని, డీఈ శ్రీనివాస్, ఏఈ ప్రశాంత్, ఏఎంఓహెచ్ కార్తిక్, జలమండలి డీజీఎంలు నారాయణ, శరత్‌రెడ్డి, మేనేజర్ యాదయ్య, శానిటేషన్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, ఖాసీం, సలీం, లియాకత్, మునాఫ్ ఖాన్, రహీం, కాజా, జహీర్‌ఖాన్ పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో సర్కారు బడుల హవా

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 65 శాతం ఉత్తీర్ణత సాధించారు. తెలంగాణ ప్రభుత్వం బుధవారం ప్రకటించిన ఫలితాల్లో మండల పరిధిలోని మొత్తం 13 హైస్కూల్స్‌లోని 1184 మంది విద్యార్థులకు గాను 767 మంది విద్యార్థులు (65 శాతం) ఉత్తీర్ణత సాధించారు. మండల పరిధిలోని గచ్చిబౌలి హైస్కూల్‌లో 71 మంది విద్యార్థులకు గాను 59 మంది (83.09 శాతం), ఉత్తీర్ణత సాధించి అగ్ర స్థానంలో నిలిచారు. మక్తామహబూబ్ పేట్ స్కూల్‌లో 30 మందికి విద్యార్థులకు గాను 12 మంది (40 శాతం) ఉత్తీర్ణతతో చిట్టచివరి స్థానంలో ఉన్నారు. రాయదుర్గం హైస్కూల్‌లో 122 మంది విద్యార్థులకు గాను 98 మంది (80.32 శాతం), లింగంపల్లి హైస్కూల్‌లో 64 మందికి గాను 51 మంది (80 శాతం), శేరిలింగంపల్లి హైస్కూల్‌లో 179 మందికి గాను 138 మంది (77శాతం), మియాపూర్ హైస్కూల్‌లో 183 మందికి గాను 83 మంది (45 శాతం), మదాపూర్ హైస్కూల్‌లో 137కు గాను 86 మంది (63 శాతం), ఖాజాగూడ హైస్కూల్‌లో 51 మంది విద్యార్థులకు గాను 34 మంది (66 శాతం), కొత్తగూడ హైస్కూల్‌లో 156 మందికి గాను 113 మంది (72 శాతం), కొండాపూర్ హైస్కూల్‌లో 60 మంది గాను 44 మంది (73 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. హఫీజ్‌పేట్ ఉర్దూ మీడియం స్కూల్‌లో 22 మందికి గాను 15 మంది (76.15 శాతం) విద్యార్థులు, దర్గా ఉర్దూ మీడియం స్కూల్‌లో 14 మందికి గాను 10 మంది (71 శాతం), వేముకుంట ఉర్దూ మీడియం స్కూల్‌లో 18 మంది విద్యార్థులకు గాను 11 మంది (66 శాతం) ఉత్తీర్ణత సాధించారు. శేరిలింగంపల్లి హైస్కూల్‌లో శ్రీరామ్ గోపిదుర్గ, కె.మహతి రెడ్డిలు 9.3 పాయింట్లు సాధించగా, లింగంపల్లి హైస్కూల్‌లో సుగ్నవేష్ 9.2, కె.సింధు 9 పాయింట్లు సాధించి స్కూల్ టాపర్స్‌గా నిలిచారు.

పటాన్‌చెరు పరిధిలో..

పటాన్‌చెరు టౌన్: పదో తరగతి ఫలితాల్లో పటాన్‌చెరు, అమీన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. పటాన్‌చెరు మండలంలో 697 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 655 మంది ఉత్తీర్ణులై 93.97 శాతం పాస్ అయ్యారు. లక్డారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సిరి 9.8 సాధించి మండల టాపర్‌గా నిలిచింది. అమీన్‌పూర్ మండలంలో 165 పరీక్ష రాయగా 161 మంది ఉత్తీర్ణత సాధించారు. అమీన్‌పూర్ పరిధిలోని అమీన్‌పూర్ జెడ్పీహెచ్ఎస్, సుల్తాన్‌పూర్ జెడ్పీ హెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ పీపీ రాథోడ్ తెలిపారు. అదేవిధంగా చిట్కుల్ గురుకుల పాఠశాల వందశాతం ఉత్తీర్ణత సాధించిందని విద్యార్థిని హర్షిని 9.8 జీపీఏ సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రమోద తెలిపారు.

'మనూ'లో సెల్ఫీ పాయింట్ ప్రారంభం



సెల్ఫీపాయింట్‌ను ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్, ప్రొఫెసర్లు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం (మనూ)లోని ఉర్దూ మీడియం ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధి కేంద్రం (సీపీటీయూఎంటీ) వద్ద 'మనూ' సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం ఈ సెల్ఫీ పాయింట్‌ను ఉర్దూ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సెల్ఫీ పాయింట్ అనేది సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా విశ్వవిద్యాలయంలో వారి అనుభవాలను సంగ్రహించడానికి, పంచుకోవడానికి విద్యార్థులు, అధ్యాపక సభ్యులను ప్రోత్సహించే ఒక వినూత్న కార్యక్రమమన్నారు. సెల్ఫీ పాయింట్ ఒక శక్తివంతమైన ప్రదేశంగా రూపొందించబడుతుందన్నారు. ఇది సెల్ఫీలు, సామూహ ఛాయాచిత్రాల కోసం జీ20, యూనివర్శిటీ లోగోల నేపథ్యాన్ని అందిస్తుందన్నారు. అదనంగా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ యూసుఫ్‌ఖాన్ రూపొందించిన జీ20 లోగోతో క్యాప్స్, టీ షర్టులు, బ్యాచ్‌లు కూడా ప్రారంభించబడ్డాయి, కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

పటాన్‌చెరు: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని జేపీ కాలనీలో నూతనంగా నిర్మించిన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు భక్తులు తరలిరావాలన్నారు.

ఫ్లెక్సీలు చింపడం సరికాదు

పటాన్‌చెరు టౌన్: దైవకార్యం నేపథ్యంలో పటాన్‌చెరు డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చింపడం సరికాదని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ... పట్టణంలోని జేపీ కాలనీలో నూతనంగా నిర్మించిన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని దుండగులు మంగళవారం రాత్రి చించివేయడం దారుణమన్నారు. ఫ్లెక్సీలు చింపిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సైబర్ వలలో సీనియర్ సిటిజన్

పటాన్‌చెరు టౌన్: సైబర్ వలలో పడి సీనియర్ సిటిజన్ రూ. 1.39 లక్షలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని శంకర్ గ్రీన్ హోమ్స్‌కు చెందిన ఓ సీనియర్ సిటిజన్ ఈ నెల 8వ తేదీన ఆన్‌లైన్‌లో కెమెరా బుక్ చేశాడు. బుక్ చేసిన కెమెరా రాకపోవడంతో 9వ తేదీన ఆన్‌లైన్ బుకింగ్‌కు సంబంధించిన టోల్ ఫ్రీ నంబరు కోసం గూగుల్ లో సోదించగా ఓ నంబరు దొరికింది. దీంతో సీనియర్ సిటిజన్ ఆ నంబరుకు ఫోన్ చేసి కెమెరాకు చెల్లించిన నగదు తిరిగి వేయాలని అడగా, చెల్లిస్తామని చెప్పి బ్యాంక్ వివరాలు అడగడంతో సీనియర్ సిటిజన్ చెప్పాడు. దీంతో 9 దఫాలుగా సీనియర్ సిటిజన్ ఖాతా నుంచి రూ. లక్షా 39 వేలు కట్ అయ్యాయి. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, జరిగిన విషయాన్ని స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కృత్రిమ మేధస్సుతో కొత్త మందుల అభివృద్ధి

రాయదుర్గం: కృత్రిమ మేధస్సును ఉపయోగించి కొత్త మందులు కూడా అభివృద్ధి చేస్తున్నామని అమెరికాలోని మిచిగాన్ స్టేట్ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఖాజీ ఎస్ అజర్ పేర్కొన్నారు. ఇది ప్రపంచ ఆరోగ్య ప్రమాణాన్ని మెరుగుపరుస్తుందన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేటివ్ కౌన్సిల్ (ఐఐసీ), తెలంగాణ సైన్స్ ఫెయిర్ అకాడమీ(టీఎస్ఎఫ్ఏ) సంయుక్తంగా జాతీయ సాంకేతిక దినోత్సవ ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన డాక్టర్ ఖాజీ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం సరికొత్త శాస్త్రీయ ఆవిష్కరణలను అందించడం ద్వారా సమాజాన్ని ఎలా తీర్చిదిద్దిందో వివరించారు.

జిల్లా పరిషత్ పాఠశాల సందర్శన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలను గురువారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ సందర్భంగా మన ఊరు –మనబడిలో భాగంగా పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ జూన్ 30వ తేదీ లోపు అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ జెమిని కుమారి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిరుపేదలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ కాలనీకు చెందిన శంకరయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.లక్ష ఎల్ఓసీ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు



శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 20, పచ్చిమిర్చి 55, బెండ 40, కాకర 50, దొండ 30, దోస 30, ఆలు 25, చామ 50, కీర 25, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 150, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 40, చిక్కుడు 80, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (3) 10, క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 250, వెల్లుల్లి రూ. 120 ప్రకారం ధర పలుకుతున్నాయి.

శుభాకాంక్షలు



హఫీజ్‌పేట్: బీజేపీ హఫీజ్‌పేట్ డివిజన్ నాయకుడు బొయిని మహేష్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



శాంతికుమారి (ఫైల్)

గచ్చిబౌలి: మూడు సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో ఇంటర్ ఫలితాలు వచ్చినకొద్ది సేపటికే ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. రాయదుర్గం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహేష్ సమాచారం మేరకు... తూర్పుగోదావరి జిల్లాకు చెందిన రసేంద్ర రావు, దుర్గ దంపతులు కొద్ది సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు వలస వచ్చారు. మణికొండలోని ఏజీఆర్ అర్కేడ్‌లో వాచ్‌మెన్‌గా చేస్తున్నాడు. చిన్న కూతురు శాంతి కుమారి రాయదుర్గంలోని మధురానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం (ఎంపీసీ) చదువుతోంది. మంగళవారం వచ్చిన ఫలితాల్లో ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. తల్లి పనికి వెళ్లగా తండ్రి బట్టలు ఇస్త్రీ చేస్తున్నాడు. ఈ క్రమంలో మూడవ అంతస్తులో నిర్మాణంలో ఉన్న ఫ్లాట్‌లోని కిటికీ లోంచి కిందికి దూకింది. తీవ్రగాయాలైన ఆ బాలికి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది.

పీఎంబీ సభ్యుడిగా ప్రొఫెసర్ పవన్‌కుమార్



ప్రొఫెసర్ పమ్మి పవన్‌కుమార్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ఫ్యాకల్టీ ప్రొఫెసర్ పమ్మి పవన్‌కుమార్ క్లాసికల్ తెలుగులో అధ్యయనాల కోసం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఈఎస్‌సీటీ), రచనలకు ప్లానింగ్–కమ్–మానిటరింగ్ బోర్డు (పీఎంబీ) సభ్యుడిగా నామినేట్ అయ్యారు. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (సీఐఐఎల్–మైసూర్) కింద కేంద్ర ఉన్నత విద్యా శాఖా ద్వారా ఈ నియామకం జరిగింది. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ స్టడీస్ ఇన్ క్లాసికల్ తెలుగు (సీఈఎస్‌సీటీ) వివిధ విద్యా పథకాలు, పరిశోధన కార్యకలాపాల అమలును పీఎంబీ పర్యవేక్షించడమే కాకుండా మార్గనిర్దేశం చేస్తుంది. ప్రొఫెసర్ పమ్మి పవన్‌కుమార్ సీఈఎస్‌సీటీ ప్లానింగ్ కమ్ మానిటరింగ్ బోర్డు సభ్యుడిగా మూడేళ్లపాటు వ్యవహరిస్తారు. ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం

మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కార్మికులు ఎక్కడ ఉంటే అక్కడ చలివేంద్రాలను ప్రారంభించాలని బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, కార్మిక నాయకుడు సీతారామయ్య పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ లేబర్ అడ్డా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నెలకొల్పిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకులు సి.శోభన్, సీఐటీయూ శేరిలింగంపల్లి కార్యదర్శి కొంగరి కృష్ణ, నాయకులు మాణిక్యం, రూపులాల్, సీనియర్ పాత్రికేయులు అమృత, లేబర్ కార్మికులు చంద్రయ్య, మల్లయ్య, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.



భార్య పుట్టింటికి వెళ్లిందని...

పటాన్‌చెరు టౌన్: కుటుంబ కలహాలతో భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లిందని మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రామనాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని శ్రీకాకుళానికి చెందిన బెజ్జాపురం మధు(32) బతుకుదెరువు కోసం వచ్చి ఇస్నాపూర్‌లో నివాసం ఉంటున్నారు. పాశమైలారం పారిశ్రామికవాడలో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో భార్యభర్త మధ్య గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. మనస్తాపానికి గురైన మధు మంగళవారం రాత్రి ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు భార్గవ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పటాన్‌చెరు సీఐకి ఉత్కృష్ట సేవా పతకం



సేవా పతకాన్ని అందుకుంటున్న సీఐ వేణు గోపాల్‌రెడ్డి, పక్కనే డీజీపీ అంజనీకుమార్

పటాన్‌చెరు టౌన్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న పటాన్‌చెరు సీఐ నూకల వేణుగోపాల్ రెడ్డి రాష్ట్ర హోంమంత్రి చేతుల మీదుగా ఉత్కృష్ట సేవా పతకం అందుకున్నారు. బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, డీజీపీ అంజనీ కుమార్ ఆయనకు ఉత్కృష్ట సేవా పతకం అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... అవార్డులు మరింత బాధ్యతను పెంచుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవార్డుకు తనను ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు.